దగ్గర రెండూ పుచ్చుకొని, రెంటిని విడి విడిగానూ, జమిలిగానూ చూడ్డం ప్రారంభించేడు.

"తప్పు సుమా,పెద్దతరం, చిన్నతరం లేకుండా ఏమిటా వాగుడు?" అన్న మా అమ్మ చూపుని తప్పించుకోలేక పోయాను.

జాతకాలు చూస్తున్న అతని మొహంలో క్రమేపి సంతృప్తి కనిపించింది.

"అద్గదీ సంగతి. ఇదివరకు అతని జాతకం చూసినప్పుడే అనుకున్నాను. ఇతనికి యింత యోగానికి కిటేకేమిటా అని ఇంకేం? మరి యోగం పట్టకేం చేస్తుంది. అమ్మాయి లగ్నంలో గురుదున్నాడు. పైగా బుధుడుతో కలిసేడు. నాలుగో యింట్లో నాలుగు శుభగ్రహాలు కలుసుకున్నాయి. నువ్వు కొనకపోతేఎవరు కొంటారమ్మా కారు? ఇహ చూడక్కర్లేదు. అసలు ఈ అమ్మాయిని కాని అతను చేసుకోకుండా యింకెవర్ని చేసుకున్నా సీసా చేత్తో పట్టుకొని, వీధికుక్కని పట్టుకొని ఏ హైదరాబాదలోనో, బొంబా యిలోనో బార్లలో పడి వుండును" గుక్క కోసం ఆగేడు.

మావారికి సెలవు లేక రాకపోవడం వల్ల ఆవేళ అతని మారకం తప్పింది.

"నీ జాతకంలో అసలు స్వార్జితం వుండాలే. బుధుడు మహా ఫవర్‌ఫుల్‌గా వున్నాడు" అని కలిపేడు.

"ఆఁఎప్పుడైనా పాతికా పరకాయిస్తార్లెండి పత్రికల వారు" అన్నాను.

"ఇంకేం కొద్ది రోజుల్లో యిల్లు కూడా కట్తావు. ఫర్వాలేదు. నీ పేర ఆస్థికూడా వుండొచ్చు"

ఏదీ ఆ పాతికతోనా! యిల్లు కట్టవలెనన్న ఎన్ని పాతికలు కావలెను? (యిటుకలూ, పెంకులూ కావు. రూపాయలు).

"మీరు చెప్పిందికాకపోదు, శాస్త్రిగారూ! అన్నట్టు చూడండీ, మా వారికి ఎనభై నాలుగో యేట మారకం ఉందట. నా మాంగల్య బలంతో ఆయన్ని బతికించుకో గలనేమో చూడండి" అన్నాను.

ఆయన జవాబు చెప్పేలోగా మా అమ్మ నన్ను డైనింగ్ హాల్లోకి ఈడ్చుకుపోయింది.

**(యువ, దీపావళి 10.11.1970)**

# పిట్ట - పురుగు

**న**డిచి, నడిచి అలిసిపోయిన కదలని కాళ్ళ దేహంతోనే ముందుకు తోసుకుంటూ "యింక నావాళ్లు కనిపించరు" అన్న నల్లని నిరాశ వీడిపోయి, తను కాపురం ఉంటున్న చెట్టు. తన వాళ్లు కనిపించగానే, కొండంత సంతోషంతో ముందు కాళ్ళతో మొహం తుడుచుకొని సర్వేశ్వరుడ్ని స్మరిస్తూ ఆకాశంలోకి చూసింది చీమ, ఆమె రెండు సున్నితమైన స్టీలు బంతులు అతి సున్నితమైన తీగతో కలిపి అతికినట్టుంది.

ఆ ఉదయం.

బాలభానుడు తన బంగారు చేతుల్తో ప్రపంచాన్ని కౌగలించు కున్న వేళ, తన పిల్లల్ని ఇల్లు వదలవద్దని బతిమాలి తిండి వేటకి బైల్దేర్దింది ఆ చీమ. బయలుదేరి అడవి అంతా నడిచింది. అడవిలో పంచదార డబ్బాలు, బెల్లం దిమ్మలూ ఉండవు. ఆఖరికి బియ్యం బస్తాలు కూడా ఉండవు. ఆఖరికి బియ్యం బస్తాలు కూడా ఉంవు. అంచేత దొరకని తిండి కోసం వెతుకుతూ లేని దార్లలో నడుస్తూ నేలకి బొట్టు బొట్టు కారుతున్న తేనె పట్టును ఆలశ్యంగా అయినాచూడగానే ఎంతో సంతోషించింది ఆమె. "ఇంక నా వాళ్లందర్నీ పిలుచుకొని రావడమే ఆలశ్యం అనుకున్న ఆమె పిల్చుకొని రావడానికి అంత ఆలశ్యం ఔతుందనుకోలేదు. కొంత సేపయ్యేక "పిల్చుకు రాగలనా అనంత రక్షకా" అన్న నిరాశ కూడా పట్టుకుంది ఆమెను. ఎంచేతంటే ఆమె దారి తప్పిపోయింది, తనకున్న 'పసి' తను తిరిగిన జాడల్లోనే సుళ్లు తిప్పుతోంది ఆమెను. ఆలశ్యం ఔతున్న కొద్దీ లేని సత్తువ తెచ్చుకొని, ఉన్న దాహం మరిచిపోయి పరిగెత్త నారంభించిన ఆమెకు, ఎన్నో గంటలు నడిచేక మళ్లీ తేనె తుట్టనే చేరుకునే సరికి ఆకలి, దప్పి, బలం, ధైర్యం అన్నీ పోయి, ఎటు చూసినా ఆకలికి పొర్లే తన పిల్లలే కనిపించేయి.

కనిపించని పిల్లల బాధ ఊహించుకుంటూ ఆమె కోరలు బిగబట్టి నడుస్తూ సర్వ రక్షకుడ్ని ఎముకల్లోంచి ప్రార్థిస్తూ చేసిన ప్రయత్నం ఫలించిన తన పుట్ట, చెట్టు కనిపించి తన తల్లంతా ఆకలిగానే వున్నా క్షేమంగానే వుండి తన కోసం ఎదురు చూస్తూం డటం చూపి – మొహం ముందు కాళ్ళతో తుడుచుకొని ఆకాశం లోకి అనంత రక్షకుడి కోసం చూడగానే కనిపించేయి – మధ్యాహ్నం లేత ఆకాశంలో గాజు ఆకుల్లా మెరుస్తున్న చెట్టు ఆకులు

ఆకులు, పువ్వులులా కనిపిస్తున్న పిట్టల రెక్కలూను, ఇంకా పరీక్షగా చూస్తే ఒక పక్షి గూట్లోనుంచి దానిమ్మ మొగ్గ ల్లాంటి పక్షి పిల్లల ఎర్ర ముక్కులు కనిపించేయి. ముక్కులు ముడుచుకునే వున్నాయి. ఆ ముక్కుల అందం చూసి మురిసి పోతున్న చీమకి తల్లి పక్షి మాంసం ముక్క పట్టుకు రావడం. పిల్లలు ముక్కులు తెరిచి అరిచేవరకు కనిపించనే లేదు. గూటి ద్వారా దగ్గర వాలిన తల్లి నోట్లోని మాంసం ముక్కని చూసి ఆత్రంగా బయటకు వచ్చేయి పిల్లలు.

ఆ సుందర దృశ్యం చూసిన చీమ ఆ అందాన్ని భరించ లేక కళ్లు మూసుకుంది.

కాని కళ్ళు తెరిచే సరికి ఆ చీమకి కనిపించినవి ఒక నల్లని తోలుస్తంభం. దాని చుట్టూ దట్టంగా ఇనుప తీగల్లా పెరిగిన వెంట్రుకలూను. సత్తువ కోసం కళ్ళు టపటపా కొట్టుకొని మళ్లీ చూసింది చీమ. ఇప్పుడు ఆమెకు కనిపించినవి రెండు తోలు స్తంభాలు. వాటిమీద ఒక పంచె, దాని మీద ఒక దేహం తల రెండు చేతులు ఆ చేతుల్లో ఒక విల్లు.

పరిస్థితి ఒక్క క్షణంలో అర్థం అయిపోయింది ఆమెకు. ఆ తోలు స్తంభాలు ఒక వేటగాడి కాళ్ళు. అతను ఆ పక్షి కుటుం బానికి బాణం గురిపెట్టి వదలడానికి సిద్ధంగా ఉన్నాడు. క్షణం ఆగితే తల్లి, పిల్లలు సర్వనాశనం అయిపోతారు, తలుచుకుంటే ఆ చీమ ఆ పక్షి కుటుంబాన్ని రక్షించగలదు. కాని ... కాని తను రక్షించిన ఆ శత్రుకుటుంబానికే కనిపించకుండా తనూ, తన పిల్లలూ బతకాలి.

"సర్వేశ్వరా! నీ లీలలు ఎవ్వరికీ అర్థం కావు. నువ్వు పులి – ఆవు, పాము – కప్ప, పిట్ట – పురుగు, గొప్ప – బీదా సృష్టించి ఒకే చోట పెట్టేవు. కాని ఒకరికి చేసిన ఉపకారం వృధాపోదు. పోనియ్యవ్" అనుకుంది చీమ.

ఇంతలో ఈశ్వరుడి ఆజ్ఞ అయింది. చీమ వేటగాడి కాలు వేటకుక్కలా కరిచింది. చీమ వేటగాడ్ని తల్లి పక్షి చూస్తూనే ఉంది. ఆ అరక్షణంలోనే గాలిని చీల్చుకుంటూ బాణం ఎగరడం – వేటగాడు తన రెండో కాలితో చీమని తన్నడం – బాణాన్ని తప్పించుకొన్న పక్షి కుటుంబం చెట్టుకో పిట్టగా ఎగిరిపోవడం – కా అని పూర్తిగా తప్పించుకోని చీమ కాలు విరిగి నేలని పడడం – వేటగాడు చీమని ముచ్చటగా మూడు బూతులు తిట్టడం జరిగిపోయేయి. విరిగినకాలు పూర్తిగా రాలిపోయి చీమ మళ్ళీ నడవగలిగేసరికి ఎన్నాళ్ళు పట్టిందో ఆమె సమంగా చెప్పలేదు కాని ఆ కాలం తన కుటుంబం ఆకలికి ఆహుతై పోవడానికి అతి కొంచెం మాత్రం తక్కువని దానికి తెలుసు.

❖ ❖ ❖

అబ్బ వర్షం!

అయ్యో వరద !!

అమ్మో ప్రళయం !!!

ప్రపంచం అంతా జలమయం. ఆకాశం లోంచి చూస్తూ ప్రపంచం అంతా గాజుముక్కలా వుంది. కొంచెం కింద నుంచి చూస్తే సుళ్ళు తిరుగుతున్న నీటితో ఉడుకుతున్న గాజు పెనంలా వుంది.

ఆవేళకి మనుషులు వండుకొని ఎన్నాళ్లో అయింది. జంతువులు తిండి తిని చాలా రోజులే అయింది. ప్రపంచాన్ని తుడిచేస్తున్న నీటిలో ఈదలేని జంతువులు మొదటే మునిగి చచ్చేయి. ఈదగలిగినవి ఇంక ఈదలేక చచ్చేయి. అంతవరకు తన గూటి కొమ్మనే కరుచుకొని వున్న చీమ తల్లి పక్షి చూడలేదు. కాని ఆ చీమ కాళ్ళు పట్టుతప్పి నీటిలో పడిపోవడం మాత్రం పక్షి చూసింది. ఆ ప్రదేశం అంతా అడివి అవటం వల్ల చెట్ల తాకిడికి నీటివేగం పూర్తిగా తగ్గిపోయింది.

నీటిలో పడ్డ చీమ ఆ తల్లిపక్షిని చూసి తనను రక్షించ మన్నట్లు – ఆ వరద అంతా దాని కన్నీరేనా అనిపించేంత ఏడిచింది. పక్షీ వెంటనే తన గూట్లోని ఎండుటాకు చీమ దగ్గర పడేశింది. "చేసిన ఉపకారం ఊరికే పోనియ్యవు కదా దయా మయా" అనుకుంటూ చీమ ఆకుని ఎక్కడం – నీరుసుడి తిరిగి ఆకు పక్షి గూటి కిందకి రావడం – పక్షి ముక్కుతో ఆకుని, చీమని తన గూట్లోకి లాక్కోవడం ఒక్కక్షణంలో జరిగి పోయేయి.

"నన్ను ఇలా రక్షించిన నీకు ఎలా కృతజ్ఞత తెలుసుకోను భగవాన్" అంది చీమ.

"ఆ మాటే నేనూ అందామనుకుంటున్నాను" అంది తల్లిపక్షి.

ఆ తర్వాత పక్షి పిల్లలు "ఇలాంటివి మరో వందైనా ఇవాళ చాలవు" అనుకుంటూ చీమని పంచుకు తినేశాయి.

**(జ్యోతి, దీపావళి ప్రత్యేక సంచిక, 10.11.1970)**